క్లుప్తంగా

మట్టల పండగ వేడుకలు



ఉదయగిరి: పట్టణంలోని స్టేట్‌పేట తెలుగు బాప్టిస్ట్ చర్చి, బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిల్లో క్రైస్తవులు, చిన్నారులు ఆదివారం ఈతమట్టల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకు ముందువచ్చే ఆదివారం పిల్లలు, పెద్దలు ఈత మట్టలు చేత పట్టుకుని స్వాగతం పలకడంతో ఆనవాయితీ.

ఘనంగా మట్టల ఆదివారం

అనుమసముద్రంపేట: మండలంలోని రాజవోలు ఈఎస్‌సీ చర్చిలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని చిన్నారులు నిర్వహించారు. పాస్టర్ సుధీర్ బాబు చిన్నారులతో కలిసి మట్టలతో వీధుల్లో ఏసుక్రీస్తు బోధనలు చేస్తూ తిరిగారు.

ఘనంగా క్రైస్తవ ర్యాలీ

అల్లూరు: స్థానిక యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో ఆదివారం క్రైస్తవులు ర్యాలీని నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు ఆలపిస్తూ వీధుల్లో ప్రచారం చేశారు.

ఘనంగా మట్టల పండగ

సంగం: మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ వద్ద ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈతమట్టలు చేత పట్టుకుని హోసన్న జయం అంటూ తిరిగారు. బంధీగా ఉన్న మానవులను విడుదల చేసి రక్షణ కల్పించారని ప్రజల రక్షణ కోసం ఏసుక్రీస్తు శిలువ మరణం పొందారని దైవసేవకులు నెహెమ్యా వివరించారు.

నేడు సర్వసభ్య సమావేశం

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రాములోరి వైభోగం



గరుడ వాహనంపై కోదండరామస్వామి గ్రామోత్సవం

ఆత్మకూరురూరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం, గ్రామోత్సవాలు, పారువేట కార్యక్రమాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. నబ్బీనగరం, నాగులపాడు, నువ్వూరుపాడు, బండారుపల్లి, చెర్లోయడవల్లి, తదితర గ్రామాల్లో హనుమంత, గరుడ, గజ, అశ్వ తదితర వాహనాలతో ఉభయకర్తలు స్వామి, అమ్మవార్ల మూలమూర్తులను విశేష పుష్పాలంకరణ గావించి తిరువీధుల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నారు.

వేడుకగా గరుడసేవ

సోమశిల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా అనంతసాగరం మండలం రేవూరులోని కోదండ రామస్వామి ఆలయంలో శనివారం రాత్రి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ఘనంగా అలంకరించారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

శేషవాహనంపై గ్రామోత్సవం

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఆదివారం సీతారాములస్వామి వార్ల దేవతామూర్తుల విగ్రహాలను శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు అలంకరణలు నిర్వహించారు.

వైభవంగా ఏకాంత సేవ మహోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఏకాంత సేవ మహోత్సవంతో ఆదివారం ముగిశాయి. సీతారాముల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. ఉభయకర్తలుగా బ్రాహ్మణకాక వెంకురెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ప్రజలకు నిషేధిత శాపం

చంద్రబాబు దుష్టపాలనకు ఫలితం

ప్రభుత్వ నిర్ణయాలు, చర్యలు ప్రజలకు మేలు జరిగే విధంగా ఉండాలి. కానీ చంద్రబాబు పాలనలో తీసుకున్న నిర్ణయం కావలి పట్టణంలోని ఓ ప్రాంత ప్రజలకు గుదిబండగా మారింది. నాలుగున్నర దశాబ్దాల క్రితం అటవీశాఖకు చెందిన భూమిని డీఫారెస్ట్ చేసి ప్లాట్లు వేసి పబ్లిక్ అవసరాలకు కొంత కేటాయించి మిగతా ప్లాట్లను ప్రజలకు విక్రయించారు. పేదలకు ఉచితంగా పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఈ భూమికి సంబంధించి అటు అటవీశాఖ వద్ద కానీ, ఇటు రెవెన్యూ, మున్సిపాలిటీల్లో పాత రికార్డులు గల్లంతు కావడంతో సమస్య జఠిలంగా మారింది.

- కావలి పట్టణంలో జఠిలంగా సమస్య
- అటవీశాఖ భూమిని డీఫారెస్ట్ చేసి ప్రజలకు విక్రయాలు, పట్టాలు పంపిణీ
- 2018లో నిషేధిత జాబితాలో చేర్చిన టీడీపీ ప్రభుత్వం
- నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పనకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం



కావలి పట్టణంలోని వెంగళరావునగర్, ఇందిరానగర్, తుఫాన్‌నగర్ ప్రాంతాలు

కావలి: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బాధ్యత లేకుండా అరాచకంగా వ్యవహరించే వారు పాలకులు అయితే.. దాని ఫలితం ప్రజలకు శాపాలుగా మారి ఎలా వెంటాడుతాయో కావలి పట్టణప్రజలు కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్నారు. జఠిలంగా మారిన ఈ సమస్యే ప్రత్యక్ష నిదర్శనం. 1976లో కావలి పట్టణం విస్తరిస్తున్న క్రమంలో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు, వివిధ ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు నిర్మించాలని నిర్ణయించింది. కావలి పట్టణానికి పశ్చిమ శివారులోని సర్వే నంబర్ 2048లో ఉన్న అటవీశాఖ భూములు అందుకు అనువైనదిగా గుర్తించింది. అటవీశాఖ భూమికు సంబంధించిన 300 ఎకరాల భూమిని సర్వే నంబర్ 2048/ఏ, 2048/బీ వాటిని భిన్నాలుగా డీ ఫారెస్ట్ చేసింది. ఇందులో 32 పబ్లిక్ స్థలాలుగా కేటాయించింది. ఆ పబ్లిక్ స్థలాల్లోనే ప్రస్తుతం విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ శాఖ కార్యాలయాలు, ప్రభుత్వ హాస్టళ్లు, పార్కులు నిర్మించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్లాట్ల విక్రయం

మిగతా భూమిని ప్రభుత్వం ప్లాట్లుగా తయారు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగులకు అప్పట్లో అంకణం రూ.7ల వంతున 36 అంకణాలకు పట్టాలు ఇచ్చింది. ఇలా 1,850 మంది వరకు ప్రభుత్వానికి మార్కెట్ ధర చెల్లించి ఇంటి స్థలాలు పొంది సొంతంగా ఇళ్లను నిర్మించుకున్నారు. పోలీస్‌శాఖ సిబ్బంది కోసం క్వార్టర్స్ సముదాయం, పోలీస్‌స్టేషన్, టెలికం శాఖ తమ ఉద్యోగులకు క్వార్టర్స్‌లు నిర్మించాయి. టీచర్స్ కాలనీ, లెక్చరర్స్ కాలనీలు ఏర్పడ్డాయి. 100, 80, 60, 40 అడుగుల రోడ్లు నిర్మించారు. కాలక్రమంలో ప్రభుత్వం పేదలకు 12 అంకణాల చొప్పున ఉచితంగా 2,000 మందికి ఇంటి స్థలాలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ స్థలాలను అమ్మేయడం ద్వారా వాటిని ఇద్దరు, ముగ్గురు కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. ఆయా ప్రాంతాలు ప్రస్తుతం వెంగళరావుగనర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్‌గా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 6,000 కుటుంబాలు ఉన్నాయి. 'గుజరాత్ సేవా సమితి' అనే సేవాసంస్థ (ఇప్పుడు 'నవవికాస్')కు అప్పట్లోనే సుమారు 300 అంకణాల స్థలం, అమెరికాకు చెందిన ఆశానికేతన్ అనే సేవా సంస్థకు మరో 300 అంకణాల స్థలం కేటాయించారు.



నిషేధిత జాబితా నుంచి తన గృహాన్ని తొలిగించాలని ఎమ్మెల్యేకు అర్జీ ఇస్తున్న విశ్రాంత తహసీల్దార్



విశ్రాంత తహసీల్దార్ చార్లెస్ రాజశేఖర్ నివాసం ముందు ఉన్న నేమ్ ప్లేట్

42 ఏళ్ల తర్వాత చంద్రబాబు పాలనలో..

1976 నుంచి ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల స్థలాలు కుటుంబ అవసరాలకు క్రయవిక్రయాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. అయితే చంద్రబాబు పాలనలో ఆ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజలకు శాపంగా మారింది. దాదాపు 42 ఏళ్లుగా పట్టా భూములుగా ఉన్న ఈ ఇళ్ల స్థలాలన్నీ నిషేధిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు చేసుకోలేక విలవిలలాడుతున్నారు. 2018లో రెవెన్యూ రికార్డుల ఆధునికీకరణ సమయంలో ఇష్టం వచ్చినట్లు తారుమారు చేశారు. 1976లో సర్వే నంబర్ 2048/ఏ, 2048/బీ డీఫారెస్ట్ అయితే.. దాన్ని తీసుకొచ్చి అటవీశాఖ భూమిగా చంద్రబాబు ప్రభుత్వం రికార్డులు మార్చేసింది. వీటితో పాటు కావలి పట్టణంలోని జనతాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లోని కొన్ని సర్వే నంబర్లను నిషేధిత భూముల జాబితాలో పెట్టేసింది. ఈ విషయం స్థానిక ప్రజలకు తెలియదు. ఈ చర్యలతో ఆయా ప్రాంతాల్లోని స్థలాలు క్రయవిక్రయాలకు రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో పడ్డాయి. ఇళ్లు, స్థలాల యజమానులు తమ పిల్లలు చదువులు, పెళ్లిళ్లు, ఇతర ఆర్థిక అవసరాల కోసం రుణాలు తీసుకోవడానికి బ్యాంక్‌లకు వెళ్లితే రుణాలు ఇవ్వడానికి ఈ స్థలాలకు అర్హత లేవని తెగేసి చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఈ స్థలాలు రిజిస్ట్రేషన్ కావని చెప్పేశారు.

ఐదేళ్లుగా నరకం..

గడిచిన ఐదేళ్లుగా ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇంటి ఆస్తులను అమ్మడానికి, అప్పుల కోసం చేసిన ప్రయత్నాలే ఏవీ ఫలించక నరకం అనుభవిస్తున్నారు. కనీసం ఆస్తులను పిల్లలక పంపకాలు చేయాలన్నా సాధ్యపడ లేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2020లో ఈ అంశాన్ని అసెంబ్లీలో మాట్లాడి తన తర్వాత ప్రభుత్వంలో కొంత చలనం వచ్చింది. అయితే వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతంలోని స్థలాలను నిషేధిత జాబితాలో తొలిగించాలంటే అటవీశాఖ ఆ భూములను డీ ఫారెస్ట్ చేసిన జీఓ కావాలని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తున్నా.. ఈ భూమికి పరిష్కారం చూపించలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో అటవీశాఖకు చెందిన ఈ భూమిని డీ ఫారెస్ట్ చేసిన జీఓ కాపీలు ఇటు అటవీశాఖ వద్ద కానీ, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల వద్ద కానీ లేకుండా పోవడంతో సమస్య జఠిలంగా మారింది. అలాంటివి ఉంటే అటవీశాఖ, రెవెన్యూశాఖ, మున్సిపల్ శాఖ ల వద్దనే ఉండాలే కాని, ప్రజల వద్ద ఎలా ఉంటుందనేది స్థానికుల ప్రశ్నిస్తున్నారు.



నా పేరు కనుపర్తి రాజశేఖర్. నాకు మా పెద్దలు వెంగళరావునగర్‌లో ఇంటిని ఆస్తిగా ఇచ్చారు. నా ఆర్థిక అవసరాల కోసం ఆ ఇంటిని ఒకరికి అమ్మేశాను. కొనుగోలు చేసిన వ్యక్తి పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడానికి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్లే.. ఈ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదని సబ్ రిజిస్ట్రార్ చెప్పారు. ఇంటిని కొనుగోలు చేసిన వ్యక్తి వద్ద నుంచి కొంత డబ్బు తీసుకొన్న నేను, ఇంటిని స్వాధీన పరిచాను. నాలుగేళ్ల నుంచి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో మిగతా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆర్థిక సమస్యలు పడుతున్నాను.



నా పేరు చాకలికొండ శారద. మాది జనతాపేట. మా ప్రాంతంలో స్వాతంత్ర్య సమర యోధులకు ఇచ్చిన భూమిని1956లో ఇంటి స్థలంగా అమ్మితే మా పెద్దలు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి 62 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. మా ఇంటిని కూడా 2018లో చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో చేర్చింది. రిజిస్ట్రేషన్లు కాకుండా ఆపేశారు. ఇదెక్కడ న్యాయం. నిషేదిత జాబితాలో పెట్టే ముందు, అక్కడ భూముల్లో పంటలు ఉన్నాయా, ఇళ్లు ఉన్నాయా చూడాల్సిన బాధ్యత లేదా?. సాధారణంగా అడ్డుగోలు పాలన చేయడంతో ప్రజలకు నరకం చూపిస్తున్నారు.

పది రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తాం



కావలి పట్టణంలో నిషేధిత జాబితాలో ఉన్న నివాసాలు, ఇంటి స్థలాల సమస్య పది రోజుల్లో పరిష్కారం అవుతుంది. అటవీ శాఖతో ముడిపడి ఉన్న సమస్య ఇది. దీనిపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలతో మాట్లాడుతున్నారు. ఉన్నతాధికారులు కూడా సమస్యను పరిష్కరించేందుకు, భవిష్యత్‌లో ఈ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.మాధవరెడ్డి, తహసీల్దార్, కావలి

దీటైన ఫలితాలతో సత్తా చాటుతాం

- కుట్రలు, కుయుక్తులతో టీడీపీ రాజకీయం
- ప్రజాబలంతోనే వైఎస్సార్‌సీపీ ముందుకు
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో టీడీపీ తరపున ఎవరిని నిలబెట్టినా వైఎస్సార్‌సీపీ అత్యుత్తమ ఫలితాలతో దీటైన సమాధానం ఇస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ నేతలు ప్రజలకు తాము చేసిన మేలును చెప్పుకొని ఓట్లు అడిగే ధైర్యం లేక కుట్రలు, కుయుక్తులతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతోందన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం నాలుగు సీట్ల గెలుపుతో ఆ పార్టీ వారు చేస్తున్న సంబరాలు హాస్యాస్పదమన్నారు. వరుస విజయాలతో అత్యంత ప్రజాబలం ఉన్న వైఎస్సార్‌సీపీ ముందు ఇలాంటి చౌకబారు వేషాలు వేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సచివాలయాల స్థాయిలో నియమించిన కన్వీనర్లు, గృహ సారథులు ఆయా గ్రామాల ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, తాను కూడా ప్రతి రెండు నెలలకు శాఖల వారీగా పరిష్కరించిన సమస్యలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి ఈనెల 11న జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, ఆయా మండలాల తహసీల్దార్ల సమక్షంలో ఆత్మకూరులో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి మండలాల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, మండలాధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, ఆయా మండలాల సచివాలయాల కోఆర్డినేటర్లు వల్లభనేని రాజేంద్ర, రమేష్‌రెడ్డి, అంకిరెడ్డి, రఘునాథరెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

మర్రిపాడు: కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం నాయకులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో రైతులు దేశ వ్యాప్తంగా పోరాటం చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈ నెల 5న ఢిల్లీలో అన్ని రాష్ట్రాల రైతు సంఘాలు, ప్రజాసంఘాలతో ధర్నా జరుగుతుందన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తుమ్మల శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- తొమ్మిది రోజులు ఉత్సవ వేడుకలు



ఉదయగిరి/వింజమూరు: వింజమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత చేన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలకు జిల్లాలో ఎంతో ప్రాధాన్యత ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దేవాలయంతో పాటు, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి సేవలో పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో కల్యాణం, రథోత్సవం ముఖ్యం కావడంతో ఈ రెండు రోజులు భక్తులుభారీగా తరలివస్తారు. సోమవారం పొన్నమాన సేవ, మంగళవారం హనుమంత సేవ, బుధవారం గరుడ సేవ, గురువారం కల్యాణోత్సవం, శుక్రవారం రథోత్సవం, శనివారం వసంతోత్సవం, పారువేట, ఈ నెల 9వ తేదీ ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

ఈ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిపేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాం. రథోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

– గణపం రమణారెడ్డి, సుదర్శనరెడ్డి

గాలివాన బీభత్సం



చేజర్ల: గాలులకు కూలిన చెట్టు



కొండాపురం రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



ఉదయగిరి: వర్షం నీటిలో ఉన్న నువ్వు

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. కోత దశలో ఉన్న వరి, శనగ, పొగాకు, నువ్వు పంటలు నేలపాలయ్యాయి. కల్లాల్లో కోసిన ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచాయి. గాలులకు కొమ్మి-చౌడవరం మధ్య చెరువు కట్టపై ఉన్న భారీ వృక్షం కూలి రోడ్డుకు అడ్డంగా పడడంతో కావలి- కొండాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక సర్పంచ్ యారం అంకమ్మ స్పందించి కటింగ్ యంత్రాలు తెప్పించి చెట్టును తొలగించే ప్రక్రియ చేపట్టారు.

చేజర్లలో..

చేజర్ల: ఆదివారం సాయంత్రం మండలంలో చేజర్లతో పాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చేజర్లలోని ఎంఈఓ ఆఫీస్ ప్రాంతంలో ఓ చెట్టు కూలి గోడపై పడింది. బిల్లుపాడు, కాకివాయి, నాగులవెలటూరు గ్రామాల్లో కోసిన వరి ధాన్యం వర్షానికి తడిసింది.

అపార నష్టం

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, జి. చెరువుపల్లి, శకునాలపల్లిలో ఆదివారం మధ్యాహ్నం ఉన్న పళంగా గంట సేపు వర్షం పడింది. దీంతో నూర్పిళ్ల దశలో ఉన్న నువ్వు పంట తడిసి పోయింది. అనేక మంది రైతులు నువ్వు నూర్పిళ్ల కోసం కూలీలతో పొలాల్లో ఉండగానే అకాల వర్షం పడింది. సుమారు 100 ఎకరాల్లో పైగా కోసి ఉన్న నువ్వు పైరు నీళ్ల పాలయింది. జొన్న పైరు కూడా దెబ్బంది. బొప్పాయి, పసుపు పంటకు కూడా నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. విపరీతమైన గాలలతో పొలాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్ష కేంద్రంలో నంబర్లు కేటాయిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆత్మకూరు పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 830 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. చేజర్ల మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 404 మంది, మర్రిపాడులో రెండు పరీక్ష కేంద్రాల్లో 286 మంది, ఏఎస్‌పేటలోని రెండు పరీక్ష కేంద్రంలో 280 మంది, అనంతసాగరంలో 411 మంది, సంగంలోని రెండు పరీక్ష కేంద్రంలో 445 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు ఇబ్బందులు కలగకుండా ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

పదో తరగతి విద్యార్థులు చక్కగా పరీక్ష రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయా పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌కు కీలకమలుపు అని, ఈ పరీక్షలు బాగా రాసి తమ ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు.

పదో తరగతి పరీక్షే కీలకం

మర్రిపాడు: 10వ తరగతి పరీక్షలే విద్యార్థుల జీవితాలకు కీలకమని ఉదయగిరి సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి ఆదిలక్ష్మి సూచించారు. మర్రిపాడులోని బాలికల వసతి గృహంలో ఆదివారం సరస్వతీదేవి పూజ నిర్వహించారు. పరీక్షలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కంపసముద్రం వార్డెన్ అంకయ్య సొంత నిధులతో వసతిగృహం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు మహ్మద్ ఆలీ, సూర్యకుమారి పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వరికుంటపాడు: సోమవారం నుంచి ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో జరిగే పది తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయగిరి మండలంలో 607 మంది, వరికుంటపాడు మండలంలో 264 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం, గండిపాళెం ఏపీబాలుర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు.



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి ఆదిలక్ష్మి

పది పరీక్షలకు సర్వం సిద్ధం

సంగం: 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంగం ఎంఈఓ జానకీరాం ఆదివారం తెలిపారు. సంగం గురుకుల పాఠశాల, సంగం హైస్కూల్ కేంద్రాలుగా 445 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వారి కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు .

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

అల్లూరు: మండలంలోని నార్త్‌మోపూర్ అరుదంతీయవాడ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు దేవమాంబ దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారికి పరీక్ష సామగ్రి ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, కమిటీ అధ్యక్షుడు జంపాల కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి నవీన్, కార్యవర్గ సభ్యులు మణికుమార్, కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చేజర్ల: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 188 మంది, సీవీఆర్ అండ్ ఎస్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 216 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

అందరి సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనరంజకంగా పాలన చేస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మండలంలోని రుద్రకోటలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలను ఆరాతీశారు. పథకాలు అందుకున్న వారికి, వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వద్దకు వచ్చి వారికి ప్రభుత్వ పథకాలు వివరించి, వారు ఏ పథకాలకు అర్హులో గుర్తించి ఆ పథకాల్లో లబ్ధిదారులుగా చేసే వ్యవస్థ సచివాలయ, వలంటీర్లు వల్ల పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. దేశంలో ఇలాంటి వినూత్నమైన ఆలోచనతో ప్రజలకు ప్రభుత్వ సేవలను వారి ఇంటికే చేర్చే విధానాన్ని ఎవరూ ఆలోచించలేదన్నారు.

సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం

కావలి నియోజకవర్గంలోని గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన నివాసంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం కన్వీనర్లు తమ పరిధిలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తెలియజేయాలన్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీలోగా అన్ని నివాసాలను పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సందర్శించే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి కుటుంబ సభ్యులతో 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చేలా చేయాలని తెలిపారు. వారి అనుమతితో ఫోన్ల మీద స్టిక్కర్లు, నివాసాల మీద స్టిక్కర్లు అంటించాలని చెప్పారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కరపత్రాన్ని అందజేయాలన్నారు.